# అన్నీ తానై... అందరివాడై!



**రాజస దీపం ఆరిపోయింది... పాదయాత్రా పథికుని ప్రస్థానం శాశ్వతంగా ఆగిపోయింది. జనం గుండె తలుపులు తట్టి, జనం గుండెచప్పుడుకు పట్టంకట్టిన వై.ఎస్. వెళ్లిపోయారు. ప్రజాజీవనంలో ఆయనది విభిన్నపంథా, విలక్షణశైలి. రాజకీయానికి సాహసాన్ని నేర్పిన వై.ఎస్.రాజశేఖరరెడ్డి... ఎప్పుడూ ప్రజల మనిషే!**

ఒకే ఒక్కడు. రాష్ట్ర కాంగ్రెస్ చరిత్రలో వై.ఎస్.రాజశేఖరరెడ్డికే ఈ మాట చెల్లుతుంది. తన రాజకీయ జీవితంలో మడమతిప్పని నేతగా నిలిచారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటం, ఎంత కష్టమొచ్చినా అనుకున్నది సాధించడం, నమ్ముకున్నవారికి న్యాయం చేయడం వై.ఎస్ సహజ గుణాలు. అకాల మరణానికి గురైన వై.ఎస్ రాష్ట్రంపై చెరగని ముద్ర వేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కొడిగట్టిన దీపంగా మారిపోతున్న తరుణంలో ఆయన మొక్కవోని దీక్షతో పార్టీని విజేతగా నిలిపారు. 1982లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తరవాత అన్ని రకాలుగా బలహీనపడ్డ కాంగ్రెస్ పార్టీకి జవసత్వాలు నింపడంలో వై.ఎస్ కృషి తక్కువేమీ కాదు. 1983-2004 మధ్యకాలంలో కాంగ్రెస్ పార్టీ అయిదేళ్ళపాటే అధికారంలో ఉంది. ఆ అయిదేళ్ళలోను ముగ్గురు ముఖ్యమంత్రులు మారారు. ఒక రకంగా అది కాంగ్రెస్ సంప్రదాయం. అధిష్ఠానం బొమ్మలను మార్చినట్లు సీఎంలను మార్చే పరిస్థితి. వై.ఎస్ హయాములో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అధిష్ఠానం ఆయనకు పూర్తి స్వేచ్ఛనిచ్చే స్థాయి వచ్చింది. సోనియాగాంధీ ఆలోచన విధానమూ వై.ఎస్‌కు కలిసొచ్చింది. బలమైన నేతలను ఎదగనీయాలనే సోనియా వైఖరిని నిచ్చెనగా చేసుకుని అతిపెద్ద నేతగా రూపొందారు.

## తిరుగులేని నేత

రాష్ట్రంలో పార్టీ నేతలెవరూ అందుకోలేనంత ఎత్తుకు ఆయన ఎదిగారు. 1985నుంచి 1998 వరకు పార్టీలో వై.ఎస్ నిత్య అసమ్మతివాదిగా పేరుపడ్డారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రులందరితో ఆయన పోరాటం చేయాల్సి వచ్చింది. 1989-94 మధ్య కాలంలో ఆయన ముఖ్యమంత్రి కావాలని ప్రయత్నించినా సాధ్యపడలేదు. మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్దనరెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి వంటి నేతలతో ఆయన రాజకీయ యుద్ధమే చేశారు. వారికి వ్యతిరేకంగా క్యాంపులు నడిపారు. అదే తాను సీఎం అయ్యేనాటికి అటువంటి శిబిరాలు లేని స్థితి సృష్టించుకోగలిగారు. సీనియర్ నేతలు చాలామంది వై.ఎస్ సీఎం అయ్యేనాటికి ఆయనతో పోటీపడే పరిస్థితిలో లేరు. కొందరు పోటీపడే యత్నం చేసినా వై.ఎస్ ముందు నిలబడలేకపోయారు. గతంలో కాంగ్రెస్ సీఎంలకు భిన్నంగా వై.ఎస్ జనంలోకి దూసుకెళ్ళారు. ఆయనకు మాస్ ఇమేజ్ వచ్చింది. కాంగ్రెస్ పార్టీలో అత్యంత జనాకర్షణగల నేతగా మారారు. ఆయన 2003లో చేసిన పాదయాత్ర దీనికి తోడ్పడింది. అప్పటిదాకా వై.ఎస్‌పై ఉన్న అభిప్రాయం మారి ఆయన జనహృదయ నేతగా ఎదగడానికి పాదయాత్రను ప్రధాన కారణంగా చెబుతారు. వై..ఎస్ గురించి ఏం చెప్పుకోవాలన్నా పాదయాత్రకు ముందు, పాదయాత్ర తరవాత అనే చెప్పుకోవాల్సి ఉంటుంది. పాదయాత్ర తరవాత తనలో కోపం అనే నరం తెగిపోయిందని ఆయన పదేపదే చెప్పేవారు. పాదయాత్ర వల్లే తాను సీఎం కాగలిగానని బలంగా నమ్మిన వై.ఎస్ తన స్థానాన్ని పదిలం చేసుకునే దిశగానే తొలినుంచీ అడుగులు వేశారు. ఎంతటి ప్రతికూల పరిస్థితుల్లోనూ తాను నమ్మినదానికే కట్టుబడి అందుకోసం తుదికంటా పోరాడటం ఆయన నైజం. తాను నమ్మిన వారికోసం, తనను నమ్ముకున్నవారి కోసం ఆయన ఎంతకైనా సిద్ధమయ్యేవారు. ఆ క్రమంలో తాను నష్టపోతాననే ఆలోచనే ఆయనకు ఉండేది కాదు. అదే సమయంలో తనకు నచ్చని వాళ్ళను పూర్తిగా దూరం పెట్టేవారు. ఇటీవలే ఆయన గతంలో పార్టీలో తానూ కొన్ని తప్పులు చేశానని ఒప్పుకొన్నారు. ప్రస్తుతం పార్టీలో ఆయన్ను ఢీకొనే స్థాయినేత లేకపోవడంతో పార్టీవాదులందరినీ కలుపుకొని వెళ్ళేలా వ్యూహ రచన చేశారు. దాంతో రాష్ట్రంలో వై.ఎస్ వ్యతిరేక వర్గమనేది కనిపించని పరిస్థితి ఏర్పడింది. మళ్ళీ వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌ను గెలిపించేందుకు ఇటీవల ఆయన ఎత్తుగడలు మొదలుపెట్టారు. ఇందులో భాగంగా ఇతర పార్టీల్లో అసంతృప్తిగా ఉన్న ఎమ్మెల్యేలు, నేతలను పార్టీలో చేర్చుకుని కాంగ్రెస్‌ను మరింత బలీయం చేసే ప్రయత్నం చేశారు.

2004లో సీఎం అయ్యాక వై.ఎస్ చాలా వేగంగా కదిలారు. వివిధ రకాల ఇబ్బందులు ఎదురైన ప్రతిసారీ ఒక కొత్త పథకాన్ని ప్రవేశపెడుతూ జనంలోకి వెళ్ళిపోయారు. సీఎం కాగానే ఉచిత విద్యుత్తును అమలుచేసి, రైతుల బకాయిల్ని రద్దుచేసిన ఆయన ఆ తరవాత జలయజ్ఞం పేరుతో భారీ స్థాయిలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టారు. దీనిపై ఎన్ని విమర్శలు వచ్చినా- సాగరంలో వృథాగా కలిసిపోతున్న నదీ జలాలను పంట చేలకు మళ్ళించే బృహత్తర పథకాలుగా జనంలో వై.ఎస్‌కు ఇమేజ్ తెచ్చిపెట్టింది. ఆపై రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశపెట్టిన ఆయన దీన్ని ఇటీవలి ఎన్నికల్లో తురుపుముక్కగా వాడారు. ఆ తరవాత ఆయన ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన రెండు రూపాయల కిలోబియ్యం పథకాన్ని తీసుకున్నారు. కేవలం ఒకే ఒక్కరోజులో దీనిపై నిర్ణయం తీసుకున్నారు. అయిదేళ్ళపాటు ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బాగుండటంతో కొత్త పథకాలకు ఇబ్బందిలేకపోయింది.

## అధిష్ఠానం అండ

నన్ను నమ్మండి నేను సాధించుకుని వస్తా- ప్రత్యేక పరిస్థితుల్లో సోనియాగాంధీతో వై.ఎస్. అన్న మాటలవి. ఆమె నమ్మారు. ఆ మేరకు వై.ఎస్ సాధించి చూపారు. అధిష్ఠానంతో దాదాపుగా అన్నిసార్లూ వై.ఎస్. మాటే నెగ్గిందంటే సోనియా ఆయనకు ఎంత ప్రాధాన్యం ఇచ్చారో స్పష్టమవుతుంది. ప్రత్యేక తెలంగాణ అంశంలో పార్టీలోని సీనియర్ నేతలంతా పార్టీ అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చినా ఆయన సమైక్యాంధ్రవైపు గట్టిగా నిలబడ్డారు. ప్రణబ్‌ముఖర్జీ, మోతీలాల్ ఓరా లాంటి నేతలు కూడా ఈ విషయంలో అంత పట్టుదలకు పోరాదని చెప్పినా ఆయన ఒప్పుకోలేదు. ఇటీవలి ఎన్నికల సమయంలో ఈ అంశంపై అధిష్ఠానం మల్లగుల్లాలు పడ్డా చివరికి వై.ఎస్ మాటనే ఓకేచేయక తప్పలేదు. అధిష్ఠానం తనను ఎంతగా ప్రోత్సహిస్తున్నా వై.ఎస్ ఢిల్లీలో తన పరిధి తెలుసుకుని ప్రవర్తిస్తూ వచ్చారు. ఢిల్లీకి సంబంధించిన పదవుల విషయంలో అధిష్ఠానంపై ఒత్తిడి పెంచే యోచన ఏనాడూ చేయలేదు. అదే విధంగా రాష్ట్రంలో పదవుల విషయంలోనూ సోనియా గాంధీ వై.ఎస్.ను గట్టిగా ఆదేశించే పరిస్థితీ ఏర్పడలేదు. దాంతో అధిష్ఠానం, వై.ఎస్. సంబంధాలు చాలా సాఫీగానే సాగుతూ వచ్చాయి. 2004లో యూపీఏ ప్రభుత్వం పలు పార్టీల మీద ఆధారపడి ఉండటం, చాలా బలమైన సీఎం కావడంతో అధిష్ఠానం పలు అంశాల్లో వై.ఎస్. పై ఆధారపడింది. 2004లో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడటానికి రాష్ట్రంనుంచి గెలిచిన ఎంపీల బలమే కారణం. మళ్ళీ రెండోసారి యూపీఏప్రభుత్వం ఏర్పడ్డానికీ అదే బలం తోడ్పడింది. అటువంటి ఆంధ్రప్రదేశ్ లాంటి కీలక రాష్ట్రంలోని బలమైన నేత శాశ్వత నిద్రలోకి వెళ్ళడం జాతీయ స్థాయిలోనూ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటే.

– ఆర్.విజయనారాయణ రావు